క్లుప్తంగా

జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు మృతి


షోయబ్(ఫైల్)

కంభం: స్థానిక జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ షోయబ్(57) బుధవారం గుండెపోటుతో మరణించారు. ఉదయం అనారోగ్యానికి గురవడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం గుంటూరుకు తరలించగా అక్కడ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డీఎస్పీతో ఉద్యోగ సంఘాల నాయకుల భేటీ


డీఎస్పీ నాగరాజును సన్మానిస్తున్న జేఏసీ నాయకులు

మార్కాపురం: ఏపీ బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ జేఏసీ నాయకులు బుధవారం మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను డీఎస్పీకి వివరించినట్లు జేఏసీ వైస్ చైర్మన్ నల్లబోతుల శ్రీనివాసులు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ దేవలూటి శంకర్ తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాదాసు రంగనాయకులు, కాశయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు కంభంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

కంభం: పెన్షనర్ల సంఘం, భారత కమ్యూనిస్టు పార్టీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న నవోదయ కోచింగ్ సెంటర్‌లో నంద్యాల శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు షేక్ మహమ్మద్ ఇబ్రహీం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్లాలు ఉన్న వారికి కంటి ఆపరేషన్లు నిర్వహించి, తిరిగి తమ వాహనంలోనే కంభం తీసుకొస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరానికి వచ్చే సమయంలో ఆరోగ్యశ్రీ కార్డు, హెల్త్ కార్డులు తీసుకురావాలని సూచించారు.

పనిభారాన్ని తగ్గించండి

- ఎంపీడీఓకు పంచాయతీ కార్యదర్శుల వినతి


ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మార్కాపురం: పనిభారం, ఒత్తిడిని తగ్గించాలని పలువురు పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వివిధ రకాల సర్వేలతో తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని, కొందరు అనారోగ్యం బారిన పడుతున్నారని వివరించారు. సర్వేల నిర్వహణలో సమస్యలకు పంచాయతీ కార్యదర్శులను బాధ్యులను చేయవద్దని విన్నవించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దిలీప్, శ్రీనివాసులు, సుధారాణి, మహేశ్వరరెడ్డి, సురేష్, పెద్దిరాజు తదతరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల వినియోగం నిషిద్ధం


చిరు వ్యాపారుల వద్ద ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలని కమిషనర్ ఐ.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని తోపుడు బండ్లు, కిరాణా షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో కలిగే నష్టాలను వ్యాపారులకు వివరించారు. కూరగాయలు, ఇతర వస్తువులను గుడ్డ సంచుల్లో తీసుకెళ్లాలని ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయి,నారాయణ,నాగార్జున,సిబ్బంది ఉన్నారు.

రేపు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఈ నెల 21న ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు ఆ సంఘ నాయకులు బుధవారం తెలిపారు. స్థానిక మాచర్ల రోడ్డులోని ముస్లిం షాదీఖానాలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జరిగే నియోజకవర్గ స్థాయి ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, ముస్లింలంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.

మాటల్లోనే స్వచ్ఛత.. చేతల్లో చెత్త!

స్వచ్ఛాంధ్రప్రదేశ్, స్వచ్ఛతా హీ సేవ పేరుతో పరిసరాల పరిశుభ్రతపై నెలకోసారి ఉపాన్యాసాలిచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్ర స్థాయిలో స్వచ్ఛతను విస్మరించారు. పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన పేరుతో హడావుడి చేసే అధికార యంత్రాంగం చెత్త చెత్తగా మారిన వీధులను శుభ్రం చేయించాలన్న విషయాన్నే మరవడం విమర్శలకు తావిస్తోంది. వీధుల్లో పోగుపడిన చెత్తను సక్రమంగా డంపింగ్ యార్డుకు చేర్చడంలో విఫలం కావడంతో ప్రజలు ముక్కు మూసుకుని తిట్ల దండకం అందుకుంటున్నారు.

- గిద్దలూరు నగర పంచాయతీలో పేరుకుపోతున్న చెత్త
- 20 వార్డుల్లో రోజూ 16 టన్నుల మేర పోగవుతున్న చెత్త
- 3 నెలల క్రితం మరమ్మతులకు గురైన కంపాక్టర్ లారీ
- ఎన్నికల సమయంలో మూలనపడిన బాబ్‌కాట్(మినీ జేసీబీ)
- మూడు రోజులకోసారి చెత్త తరలించడమే గగనం
- డ్రైయినేజీల్లో పేరుకుపోయిన పూడిక తీయడమే మరిచిన వైనం


కంపాక్టర్ లారీ లేకపోవడంతో పాములపల్లె రోడ్డులో చెత్తను ట్రాక్టర్‌లో తరలిస్తున్న సిబ్బంది

గిద్దలూరు రూరల్:

గిద్దలూరు నగర పంచాయతీలో నివాసాల నుంచి సేకరించిన చెత్త తరలింపుపై పాలకవర్గంలో చిత్తశుద్ధి లోపించడంతో నగర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగర పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో ఏర్పాటు చేసిన 18 కంపాక్టర్ టిన్నుల వద్ద రోజూ సుమారు 16 టన్నుల చెత్త పోగవుతోంది. ఈ చెత్తను కంపాక్టర్ లారీ సహాయంతో డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉండగా అది కాస్తా 3 నెలల క్రితం మరమ్మతులకు గురైంది. అలాగే బాబ్‌కాట్(చిన్న జేసీబీ) మూలనపడి ఏడాదైనా పట్టించుకున్న నాథుడు లేరు. కంపాక్టర్ లారీతో ఒక్క పూటలో 18 టిన్నుల్లో ఉండే చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తుంది. అది మూలన పడిపోవడంతో చెత్త తరలింపు నెమ్మదిగా కొనసాగుతోంది. 30 మంది కార్మికులు కలిసి చేయాల్సిన పనిని ఒక కంపాక్టర్ లారీ పూర్తి చేస్తుంది. ఈ వాహనం మరమ్మతులకు గురైనప్పటి నుంచి నగర పంచాయతీలోని పారిశుధ్య సిబ్బందిని వినియోగించి ట్రాక్టర్లతో చెత్త తరలిస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది కొరతతో పనిభారం పెరిగిందని కార్మికులు ఆందోళన చెందుతున్న తరుణంలో కంపాక్టర్ లారీతో చేయాల్సిన పనిని సైతం తమపై మోపడాన్ని వారు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. కంపాక్టర్ లారీ మరమ్మతులకు గురైనప్పటి నుంచి నగర పంచాయతీ పరిధిలోని పెద్ద మార్కెట్‌సెంటర్, పొట్టిశ్రీరాములసెంటర్, పాములపల్లెరోడ్డు, కృష్ణా థియేటర్, ఎల్‌ఐసీ కార్యాలయం, కొంగలవీడురోడ్డులోని వరసిద్ది వినాయకస్వామి ఆలయం, సుంకమ్మ బజారు లాంటి ప్రధాన వీధుల్లో చెత్త భారీగా పేరుకుపోతోంది. మూడు రోజుల పాటు చెత్త నిల్వ ఉంటుండటంతో స్థానిక నివాసాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


చెత్తను ట్రాక్టర్‌లో తరలిస్తున్న సిబ్బంది

డ్రెయినేజీల్లో పూడిక.. తీసే దిక్కులేక..

గిద్దలూరులో చెత్తను తరలించేందుకు 19 రిక్షాలు, 17 పుష్‌కాట్, ఒక బాబ్‌కాట్, ఒక కంపాక్టర్ లారీ, 3 ట్రాక్టర్లు ఉన్నాయి. అందులో కంపాక్టర్ లారీ, బాబ్‌కాట్ మరమ్మతులకు గురయ్యాయి. శానిటేషన్ విభాగంలో దినసరి కూలీలుగా 25 మంది, ఒప్పంద కార్మికులుగా 60 మంది, రెగ్యులర్‌గా కార్మికులు ఏడుగురు విధులు నిర్వహిస్తున్నారు. శానిటేషన్ విభాగంలో పనిచేసే 60 మంది ఒప్పంద కార్మికుల్లో 10 మందిని నగర పంచాయతీ కార్యాలయంలో అటెండర్ విధులకు వినియోగించుకుంటున్నారు. కంపాక్టర్ మరమ్మతులకు గురవడం, పది మంది కార్మికులు కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండటంతో పారిశుధ్య పనుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలో ఎక్కడైనా పందులు, కుక్కలు చనిపోయాయని సమాచారమిస్తే వాటిని మరుసటి రోజు వరకు తొలగించడం లేదు. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని రోజుల తరబడి తీయకపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. దీంతో దోమలు విజృంభించి ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. నగర పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.


మరమ్మతులకు గురైన కంపాక్టర్ లారీ

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు


మార్కాపురం : సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ సుబ్బారావు


కొమరోలు : పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను తనిఖీ చేసి పంపిస్తున్న సిబ్బంది

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ, రూరల్ పరిధిలో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న 16 కేంద్రాల్లో కాపీయింగ్, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. బుధవారం పట్టణ, రూరల్ పరిధిలోని పరీక్ష కేంద్రాలను ఎస్సైలు రాజమోహన్ రావు, అంకమరావు, సైదుబాబుతో కలిసి సీఐ తనిఖీ చేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపాలని సిబ్బందికి సూచించారు. బయట నుంచి ఎవరైనా కాపీయింగ్‌కు ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తర్లుపాడు: మండలంలోని తర్లుపాడు, తుమ్మలచెరువు, వెలుగొండ, రాయవరంలోని టెన్త్ పరీక్ష కేంద్రాలను బుధవారం ఎంఈఓలు, ఎస్సై పరిశీలించారు. విద్యార్థులకు మంచినీరు, వైద్య సదుపాయాన్ని అందుబాటులో ఉంచారు.


తర్లుపాడు జెడ్పీ హైస్కూల్లో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

కొమరోలులో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు

కొమరోలు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సాగుతున్నాయి. బుధవారం రెండో రోజు హిందీ పరీక్షకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ-2 బొర్రా వెంకటరత్నం తెలిపారు. మండలంలో మొత్తం 450 మంది విద్యార్థులకుగాను ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో ఒకరు, నరేష్‌రెడ్డి ఇంగ్లిష్ మీడియం స్కూల్ కేంద్రంలో ఒకరు హాజరు కాలేదని వివరించారు.

వ్యవసాయ యాంత్రీకరణకు దరఖాస్తు చేసుకోండి

కురిచేడు: మండలంలోని రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు కోరారు. వ్యవసాయశాఖ ద్వారా ఎఫ్ఎం పథకంలో భాగంగా రైతులకు రాయితీతో కూడిన వ్యవసాయ పనిముట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన చెప్పారు. మండలానికి రూ.4.461 లక్షల సబ్సిడీ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ సామాన్లు, మందు పంపులు, పీవీసీ పైపులు వంటివి ప్రభుత్వ రాయితీలో పొందవచ్చని వివరించారు. మరింత సమాచారం కోసం ఆయా గ్రామాల పరిధిలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఏఓ మధుబాబు సూచించారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏఓ మధుబాబు

సంఘాల అభివృద్ధికి ఐక్యంగా పాటుపడదాం

యర్రగొండపాలెం: ఐక్యంగా పనిచేస్తేనే సంఘాలు అభివృద్ధి చెందుతాయని, ఆ దిశగా తామందరం కలిసికట్టుగా కార్యక్రమాలు నిర్వహించుకుందామని నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు సన్నెపోగు సుందరరాజు అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌జీవోస్ కాలనీలోని క్రీస్తు సంఘ భవనంలో జరిగిన పాస్టర్ల కార్యవర్గ సమావేశం, నెలవారీ సహవాస కూడిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటి గురించి చర్చించి పరిష్కరించుకుందామన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు, పాస్టర్లు డగ్లస్, రావూరి ఆనందరావు, చాట్ల గంగయ్య, కొండెపోగు సామేలు, వీరదాసు ఆశీర్వాదం, పరిమి కృపసత్యం, భవనాసి వెంకటయ్య, దుగ్గెం కనకరాజు పాల్గొన్నారు.

పరీక్ష ఓ చోట.. వెళ్లింది మరోచోటకు..!

- బైక్‌పై వదిలిపెట్టిన ట్రాఫిక్ ఎస్సై



బైక్‌పై విద్యార్థినిని తీసుకెళ్తున్న ట్రాఫిక్ ఎస్సై అహరోన్

మార్కాపురం: మార్కాపురం మండలం కొండేపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని బుధవారం ఉదయం మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల కేంద్రానికి బదులు హడావుడిలో బాలుర ఉన్నత పాఠశాలకు వెళ్లింది. పరీక్ష సమయం దగ్గర పడటంతో ఆందోళనతో దిక్కులు చూస్తుండగా ట్రాఫిక్ ఎస్సై అహరోన్ గమనించారు. హుటాహుటిన తన బైక్‌పై తీసుకెళ్లి జెడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద వదిలిపెట్టడంతో ఆ విద్యార్థిని ఊపిరి పీల్చుకుంది. ట్రాఫిక్ ఎస్సైని సీఐ సుబ్బారావు, డీఎస్పీ నాగరాజు అభినందించారు.

సాగర్ పైప్‌లైన్ పనులు సత్వరమే చేపట్టాలి


నిలిచిన పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పొదిలి: పొదిలికి సాగర్ జలాలు తరలించే పైప్ లైన్ పనులను సత్వరమే చేపట్టాలని సీపీఎం కార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్ చేశారు. అర్ధంతరంగా నిలిచిన పనులను ఆయన బుధవారం పరిశీలించారు. పొదిలి పట్టణ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాత్రులు నిద్ర మానుకుని, పగలు పనులు మానుకుని వేచి చూస్తూ, నీరు వచ్చినపుడు ఒక బిందె పట్టుకునే పరిస్థితి ఉందన్నారు. రెండు కిలోమీటర్ల దూరంలోని పంప్ హౌస్ వద్ద, ఆర్టీసీ బస్టాండ్ దగ్గర సాగర్ కుళాయిలకు నీరు వస్తుంటే పట్టుకోవడమే తప్ప, పైపులైన్లలో నీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంచినీటి పథకం కోసం రూ.50 కోట్లు నిధులు మంజూరు చేసి, పనులను చేపట్టగా ఎన్నికల వేళ నిలిచిపోయాయన్నారు. ఆగిపోయిన పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు తొమ్మిది నెలలు గడుస్తున్నా పనులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తగినన్ని నిధులు కేటాయించి పనులు సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ పి.బాలనరసయ్య, ఆర్.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, ఎన్.వెంకటేశ్వరరెడ్డి, జి.నరసింహారావు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వలో జాగ్రత్తలు తీసుకోవాలి


నరవలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ


మూగచింతలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

గిద్దలూరు రూరల్: రైతులు ధాన్యం నిల్వలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం నరవ గ్రామంలో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ఆహార ధాన్యాలను నిల్వ చేసుకోవడంలో అవగాహన లేకపోవడం వల్ల 10 శాతం మేర నష్టపోతున్నారన్నారు. వేపగింజల పొడి ఉపయోగించి వరి, శనగ, కందులు తదితర పంట ఉత్పత్తులను కీటకాల బారినపడకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫేట ఎస్‌కే జైన్‌లాబ్దిన్ సూచించారు. బుధవారం పొదిలి మండలంలోని మూగచింతల, కొండాయపాలెం గ్రామాల్లో రైతులకు అవగహన కల్పించారు. రాయితీపై పనిముట్లు అవసరమైన వారు వీఏఏల వద్ద దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు.

చప్టా గుంత.. ప్రజలకు చింత!


నాలుగు రోడ్ల కూడలిలో తీసిన గుంత

- నాలుగు రోడ్ల కూడలి కావడంతో అవస్థలు
- 20 రోజులుగా రాకపోకలకు ఇబ్బందులు

బేస్తవారిపేట: స్థానిక నెహ్రూ వీధి చివరలో చప్టా శిథిలావస్థకు చేరడంతో పూర్తిగా తొలగించారు. జేసీబీతో లోతైన గుంత తీసి నిర్మాణ పనులు మొదలుపెట్టకుండా వదిలివేశారు. దీంతో ఆ గుంతలో మురుగు చేరి దుర్వాసన వస్తుండటంతో చుట్టు పక్కల గృహాలవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నాలుగు రోడ్ల కూడలి కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. 20 రోజులుగా పట్టించుకోకపోవడంతో చిన్న పిల్లలు గుంత పక్కనుంచి వెళ్లేందుకు ప్రయత్నించే సమయంలో లోపల పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. నిత్యం రాకపోకలు సాగించే రోడ్డులో చప్టాను త్వరగా పూర్తి చేయకుండా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మహిళల ఆందోళన

రెండు రోజుల క్రితం స్థానిక మహిళలు పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లి ఆందోళన వ్యక్తం చేశారు. చప్టా నిర్మాణం చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సకాలంలో నిర్మించనప్పుడు ఎందుకు లోతైన గుంత తీశారని ప్రశ్నించారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేయిస్తామని అధికారులు చెప్పినా ఆచరణకు నోచుకోలేదు.

కేజీబీవీలో ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ

దర్శి: కేజీబీవీల్లో ప్రవేశాల కోసం ఈ నెల 22వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం, 7, 8, 9, 10, 12వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికలు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో 40 మంది, ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరానికి 40 సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులు మార్చి నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు చెప్పారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్‌లకు పరిగణిస్తామని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని చెప్పారు. పూర్తి వివరాలకు 99663 66175 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

కురిచేడు: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.పద్మావతి తెలిపారు. సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈ నెల 22 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. 7,8,9,10,12 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.